ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 25.0

7 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు
■ లోపలి పేజీలో..



ఢిల్లీలో కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌కు కొల్లేరు సమస్యలను విన్నవించి సత్కరిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు కామినేని, పత్సమట్ల

కొల్లేరుపై నివేదిక ఇవ్వండి

- 12 వారాల గడువు విధిస్తూ 'సీఈసీ'కి సుప్రీంకోర్టు ఆదేశాలు
- రెండు రోజులుగా ఎమ్మెల్యే కామినేని ఢిల్లీలో పెద్దలతో చర్చలు

కైకలూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):కొల్లేరు ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టులో గట్టి వాదనలు వినిపించింది. దీనిపై న్యాయమూర్తి నేషనల్ ట్రిబ్యునల్ బోర్డు గైడ్‌లైన్స్ అనుసరిస్తూ 12 వారాల్లో గ్రౌండ్ స్థాయి నివేదికను అందజేయాలని సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీని ఆదేశించారు. మూడు దశాబ్దాలుగా కొల్లేరు ప్రజలు పడుతున్న సమస్యలను పట్టించుకోకుండా పర్యావరణం అంటూ ప్రజల జీవనోపాధిని దెబ్బతీశారని, వారికి కావాల్సిన అవసరాలను తీర్చలేదని, తినేందుకు తిండి లేక ప్రజలు పొట్ట చేత పట్టుకుని ఉపాధి కోసం వలసలు పోతున్నారని, గ్రామాల్లో వృద్ధులు, పిల్లలు పడుతున్న పాట్లు, కొల్లేరు ఆపరేషన్ అనంతరం అక్కడి ప్రజల జీవన స్థితిగతులను కోర్టుకు విన్నవించారు.

రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి..

ఇప్పటికే కొల్లేరు ప్రజల సమస్యలను ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించి న్యాయ పోరాటానికి సిద్ధమైంది. ఈ బాధ్యతను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని, ఎంపీ పుట్టా తీసుకున్నారు. ఎమ్మెల్యే కామినేని రెండు రోజులుగా ఢిల్లీలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి కొల్లేరు సమస్యపై చర్చించారు. ఆయనతోపాటు సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ(సీఈసీ) సభ్యుడు గోయల్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో కొల్లేరు సమస్యపై చర్చించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను సుప్రీంకోర్టులో న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. న్యాయమూర్తి నేషనల్ ట్రిబ్యునల్ బోర్డు గైడ్‌లైన్స్ అనుసరిస్తూ 12 వారాల్లో గ్రౌండ్‌స్థాయి నివేదికను అందజేయాలని సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీని ఆదేశించారు. దీంతో కొల్లేరు ప్రజలు పడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇక్కడ ప్రజల జీవన స్థితిగతులను, జీవనోపాధికి పడుతున్న ఇబ్బందులను, కావాల్సిన మౌలిక వసతులు, జిరాయితీ, సొసైటీ భూములను ధ్వంసం చేసిన అంశాలను తెలుసుకోవడంతోపాటు వారి ఇబ్బందులపై పూర్తిస్థాయిలో నివేదిక తయారుచేసి సీఈసీ కమిటీ ద్వారా కోర్టుకు అందజేయనున్నారు.

కొల్లేరు వాసుల హర్షం

సుప్రీంలో ప్రజల తరఫున మొదటిసారి వాదనలు వినిపించడం, కోర్టు గ్రౌండ్ నివేదిక కోరడంతో కొల్లేరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు తమ గోడును పట్టించుకున్న నాథుడే లేడని టీడీపీ ప్రభుత్వం చొరవ తీసుకుందని ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఢిల్లీలో కామినేని వెంట రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, నంబూరి శివాజీరాజు, వాసురాజు, కొల్లేరు సంఘ నాయకులు బలే ఏసురాజు, జయమంగళ సుబ్బరాజు, కొల్లి వరప్రసాద్, చింతలమూడి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

భూసారాన్ని పెంచాలి

- ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు
- సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలు.. టార్పాలిన్‌లు
- మిగులు ధాన్యం కొనుగోలుకు అనుమతి

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందించాలని, మేలైన విత్తనాలు, టార్పాలిన్లు, విత్తనాలు అందించాలంటూ రైతులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. బుధవారం ఏలూరు జిల్లా వ్యవ సాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయశాఖ జేడీ షేక్ హబీబ్‌బాషాతో నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్' కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. రైతుల సమస్యలన్నింటినీ విన్న జేడీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రైతులు పంటల తెగుళ్లపై అడిగిన సమస్యలకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రకుమార్ సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయంపై డీపీఎం బి.వెంకటేశ్ వివరించారు. ఏడీఏ, డీఆర్ పి.లలితాసుధ కూడా రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వగా పెదపాడు ఏవో వి.ప్రదీప్‌కుమార్, టెక్నికల్ ఏవో కాశీమాత పాల్గొన్నారు.

విత్తనాలు..టార్పాలిన్లు.. స్ప్రేయర్లు కావాలి

- ఖరీఫ్‌లో స్వర్ణ, సంపత్‌స్వర్ణ, పీఎల్ 1100, 1318 రకాల విత్తనాలు కావాలి. వాతావరణం సరిగా లేకపోవటంతో రబీ సాగులో పండించిన పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.
  - ఎస్.వెంకట్రావు, కొత్తపట్టిసీమ

జేడీ : ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు జరుగుతోంది. మీ సమస్యను పరిశీలిస్తాం.

- టార్పాలిన్‌లు, ఆయిల్ ఇంజన్లు కావాలి. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా సబ్సిడీపై అందించాలి.
  - గోలి నారాయణరావు, ఎర్రంపేట

జేడీ : ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు ఉన్నాయి. అక్కడ నుంచి రాగానే ఇవ్వడం జరుగుతుంది.

- మా పొలంలో 1121 రకం విత్తనాలు వేశాం. ఒక్క ఏడాదిలోనే దుబ్బు కుళ్లు తెగులు ఆశించింది. భూసార పరీక్షలు చేయించుకోవాలా ? సంపత్ స్వర్ణ వేశాం. ఒక ఏరియాలో దిగుబడి 45 బస్తాలు రాగా ఇంకో ఏరియాలో 35 బస్తాలే వచ్చింది. కారణమేమిటి?
  - నీలం శ్రీనివాసరావు, పి.కన్నాపురం, ద్వారకాతిరుమల మండలం.

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రకుమార్ : ఈ దుబ్బు తెగులు ముందుగా కనిపించదు. మొక్క ఎండిపోయి, వడలిపోయినట్లుంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

జేడీ : విత్తన సమస్య పరిశీలనకు ఏవోను పంపిస్తాం.

- సబ్సిడీపై బ్యాటరీ స్ప్రేయర్లు, పచ్చిరొట్ట విత్తనాలు కావాలి. బ్యాటరీ స్ప్రేయర్లకు ఒక్కొక్కసారి ఒక ధర చెబుతున్నారు.
  - మురళీకృష్ణ, గూటాల

జేడీ : ఏవోతో మాట్లాడి పరిష్కరిస్తాం.

డీపీఎం : 12.5 కేజీల ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన కిట్ ఆర్‌ఎస్‌కేల వద్ద అందిస్తున్నాం. ఈ విత్తనాలు మంచివి. భూమిలోని సూక్ష్మపోషక విలువలను పెంచుతుంది. కలుపు నివారణ జరుగుతుంది. పశువులకు మేత వేస్తే పాల దిగుబడులు పెరుగుతాయి.

- సబ్సిడీపై టార్పాలిన్‌లు కావాలి. త్వరగా ఇస్తే మాకు ప్రయోజనం చేకూరుతుంది.
  -పి.గౌరీశంకర్, గొల్లగూడెం

జేడీ : సబ్సిడీపై టార్పాలిన్‌లు అందిస్తాం.

- భూసార పరీక్షలు ఎప్పుడు చేస్తారు. స్ప్రేయర్లు కావాలి.
  - ఎంవీ మధుసూదనరావు, శివాపురం

జేడీ : భూసార పరీక్షలు చేస్తున్నారు. రైతుసేవా కేంద్రానికి వెళ్లి కలవండి. బ్యాటరీ స్ప్రేయర్లు సబ్సిడీపై ఇస్తున్నారు.

- జనుము, జీలుగ విత్తనాలు కావాలి.
  - మల్లేశ్వరరావు, ప్రగడవరం

జేడీ : ఆర్‌ఎస్‌కే వద్దకు వెళ్లి కలవండి. ప్రకృతి వ్యవసాయం కిట్ తీసుకుని వేయండి. భూసారం పెరుగుతుంది.

- సార్వాలో సబ్సిడీ విత్తనాలు కావాలి మార్కెట్‌లో మొక్కజొన్న తక్కువ రకం విత్తనాలు లభిస్తున్నాయి.
  - కె.శ్రీనివాసరావు, పోలవరం

జేడీ : ధాన్యం సేకరణ మాదిరిగానే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తాం.

- వ్యవసాయయాంత్రీకరణ పనిముట్లు మార్కెట్‌లో కంటే ప్రభుత్వ ధరలు ఎక్కువగా ఉన్నాయి. వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ పెంచాలి.
  - కలుం బాపిరాజు, ప్రగడపల్లి, పోలవరం మండలం

జేడీ : ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల్లో నాణ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు అందిస్తుంది.

- పచ్చిరొట్టవిత్తనాలు వచ్చాయని చెబుతున్నారు. కాని రాలేదు
  - కె.లక్ష్మణ్, పి.కన్నాపురం, ద్వారకాతిరుమల మండలం

జేడీ : రెండు రోజుల్లో వస్తాయి.ఆర్‌ఎస్‌కేల వద్దకు గాని లేదా ఏవోను గాని కలవండి.

- సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సమ్, బోరాన్ సబ్సిడీపై ఇవ్వాలి

- ఖరీఫ్‌లో మినుములు పండించవచ్చా..?
  - ఎం.గంగాధర్, బూసరాజుపల్లి, బుట్టాయిగూడెం మండలం.

శాస్త్రవేత్త: ఖరీఫ్‌లో కొత్తగా ఎల్‌బీజీ 884, టీబీజీ 129,141 రకాలు వుంటాయి. అవి ఎక్కడ లభిస్తాయో తెలియ జేస్తాం.

జేడీ : ఒక్క ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయండి. మీ పొలానికి వచ్చి స్వయంగా పరిశీలిస్తాం.

- అన్నదాత సుఖీభవకు కేంద్రం సొమ్ములు బ్యాంకులలో జమ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ సొమ్ములు ఎప్పుడు వస్తాయి.
  - టి.భూషణం, జొన్నవారిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం.

జేడీ : మేనెలలో అన్నదాతాసుఖీభవ సొమ్ములు బ్యాంకులలో జమ చేస్తారు.

- ఇటీవల చేలు పడిపోయాయి. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి
  - నరసింహరావు, పోలవరం.

జేడీ :ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి రాగానే ఇస్తాం. మేలో పెట్టుబడి సాయం అందుతుంది.

- బి.గంగరాజు, వేరువరప్పాడు, కైకలూరు మండలం.

జేడీ : సూక్ష్మపోషకాలు అందిస్తాం. భూముల్లో చౌడు పోవాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాలి.

- జీలుగు విత్తనాలు కొద్దిగానే వచ్చాయి.
  - కె.హనుమంతరావు, చాట్రాయి

జేడీ : పచ్చిరొట్ట విత్తనాలను అందరి రైతులకు అందిస్తాం.

- 4 ఎకరాల్లో మిర్చి పండించాం. నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. ఆయిల్ ఇంజన్లు ఇప్పించండి
  - కూరాకుల సురేష్, ఉప్పేరు, కుక్కునూరు మండలం

జేడీ : ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

- 10ఎకరాలు సాగుచేశాను. కోతకు వచ్చింది. వాతావరణం అనుకూలంగా లేక ధాన్యాన్ని ఆరబెట్టటం కష్టతరంగా మారింది. పచ్చిధాన్యాన్ని కొనుగోలు చేయాలి.
  - రంగారావు, కొత్త పట్టిసీమ, పోలవరం మండలం

జేడీ : ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి.

- పెసలుకు మద్దతు ధర ఇంకా పెంచాలి.
  - సవలం శ్రీనివాసరావు, వట్లూరు

జేడీ :పెసలు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నాం.

మిగులు ధాన్యం సమస్య..

- ఖరీఫ్ మిగులు ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయండి.
  - ఎర్నేని లీలాప్రసాద్, పెనుమల్లి, ముదినేపల్లి మండలం

జేడీ : ఖరీఫ్ మిగులు ధాన్యాన్ని కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్‌ఎస్‌కే వద్దకు వెళ్లి కలవండి.

- పది ఎకరాల్లోని ఖరీఫ్ మిగులు ధాన్యం ఉంది. ఏవోకు చెప్పి ఈ- పంట నమోదు చేశాం.
  - నారాయణరావు, గురజ

జేడీ : ఒకటి, రెండు రోజుల్లో మీ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకోవడం జరుగుతుంది.


నాడు


నేడు

మోతుగూడెం పాఠశాలకు మోక్షం

కూలడానికి సిద్ధంగా ఉన్న మోతుగూడెం కాలనీ పాఠశాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. దట్టమైన అటవీ ప్రాంతంలోని మోతుగూడెం కొండరెడ్డి గ్రామాన్ని సుమారు 12 ఏళ్ల క్రితం కామవరం సమీపంలోకి ఐటీడీఏ అధికారులు తరలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీలో 120 కుటుంబాల వరకు ఉండగా ఐటీడీఏ అధికారులు ప్రభుత్వ సహకారంతో కొత్తగా పాఠశాలను మంజూరు చేశారు. ప్రస్తుతం 18 మంది కొండరెడ్డి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలను మంజూరు చేసిన ప్రభుత్వం అప్పట్లో సొంత భవనాన్ని మంజూరు చేయకపోవడంతో గ్రామస్థులే తాటాకు పాకలో పాఠశాలను ఏర్పాటు చేశారు. దాని నిర్మించి చాలా కాలం కావడంతో శిథిలావస్థకు చేరింది. ప్రభుత్వం భవనాన్ని మంజూరు చేస్తుందని కొండరెడ్లు ఆశగా ఎదురు చూస్తున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో బుధవారం గ్రామస్థులంతా ముందుకొచ్చి పాకను పటిష్టం చేసి పాత తాటాకులను తొలగించి కొత్త తాటాకులతో పాకను కట్టి శుభ్రం చేశారు. ప్రభుత్వం భవనాన్ని మంజూరు చేసి నిర్మించాలని కోరుతున్నారు.

- బుట్టాయగూడెం


దొరమామిడి వద్ద నేలవాలిన మొక్కజొన్న పంట


జంగారెడ్డిగూడెంలో ఇంటిపై పడిన మామిడి చెట్టు

మన్యంలో ఈదురు గాలుల బీభత్సం

- విరిగిపడిన చెట్లు, తెగిపోయిన విద్యుత్ వైర్లు
- అంధకారంలో గిరిజన గ్రామాలు

బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ మన్యం ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి బలమైన ఈదురు గాలులు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి బుధవారం ఉదయం వరకు ఏజెన్సీలోని గ్రామాలు అంధకారంలో మగ్గాయి. తూర్పు రేగులకుంటలో తాటిచెట్టు విరిగిపడి ఆసి దుర్గారావుకు చెందిన చూడిగేదె చనిపోగా మరో చూడిగేదె నడుం విరిగింది. పాడిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. వర్షం కారణంగా విద్యుత్ శాఖకు తీవ్రనష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు. దొరమామిడి, మర్లగూడెం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు. సుమారు 20 ఎకరాలకు పైగా పంట దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. గాలులకు మామిడి, జీడి మామిడి పంట నేలరాలడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోను ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల వృక్షాలతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రాత్రంతా పట్టణంలోను,మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ డీఈఈ అహ్మద్,ఏడీఈ సుబ్బారావు పర్యవేక్షణలో నేల కొరిగిన చెట్లను తొలగించి నూతన విద్యుత్ స్తంభాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. మునిసిపల్ కమిషనర్ కెవి.రమణ, టీడీపీ నాయకులు పెనుమర్తి రామకుమార్, కొండ్రెడ్డి కిషోర్, గుమ్మడి ప్రసాద్ శ్రీనివాసపురం రోడ్డులో విరిగిపడిన వృక్షాన్ని పరిశీలించారు. స్థానిక రాజీవ్ నగర్‌లో నీలంశెట్టి సుజాత ఇంటిపై మామిడి చెట్టు పడడంతో స్వల్పంగా దెబ్బతింది.

సాగర్ కుడి, ఎడమ కాలువలకు నిధులు మంజూరు చేయాలి

నూజివీడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియాకు విజ్ఞప్తి చేసినట్టు సాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ తెలిపారు. నూజివీడులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 16వ ఆర్థిక సంఘం చైర్మన్ బృందాన్ని విజయవాడలో కలిసి వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. ఎడమ కాలువ ఆధునికీకరణకు రూ.199 కోట్లు, కుడి కాలువ ఆధునికీకరణకు రూ.2,225 కోట్లు నిధులు అవసరమని గతంలోనే జలవనరుల శాఖ ద్వారా 16వ ఆర్థిక సంఘానికి నివేదిక పంపారన్నారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువల కింద ఏడు జిల్లాల్లోని 16.83 లక్షల ఎకరాల ఆయకట్టుకు 737 గ్రామాలకు, పది మునిసిపాల్టీలకు తాగునీరు అందించడానికి వీలుగా ఈ నిధులు అవసరమన్నారు. కుడికాలువ ప్రాజెక్టు వైస్ చైర్మన్ చక్రపాణి, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డీసీ చైర్మన్‌లు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏలూరు జిల్లాకు చెందిన డీసీ చైర్మన్ బాలకృష్ణ, కృష్ణా జిల్లాకు చెందిన డీసీ కమిటీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హాజరు నమోదు లొకేషన్లను నిశితంగా పరిశీలిస్తాం

- డీఎంహెచ్‌వో మాలిని

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో ముఖ ఆధారిత గుర్తింపు (ఎఫ్‌ఆర్‌ఎస్) హాజరు నమోదులో కొందరు అనైతిక పద్ధతులకు పాల్పడుతూ రాష్ట్ర అధికారులకు అడ్డంగా దొరికిపోయిన నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న పరిణామాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని దిద్దుబాటు చర్యలు చర్యలు చేపట్టారు. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదులో అక్రమాలకు పాల్పడిన పలువురు వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఇలా తాఖీదులందుకున్న వారిలో జిల్లాకు చెందిన వారు ఉన్నారు. ఈ పరిణామాలపై సమీక్షించేందుకు డీఎంహెచ్‌వో బుధవారం అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లతో జూమ్ మీటింగ్‌తో పాటు, సర్క్యులర్ ఉత్తర్వులను జారీచేశారు. పీహెచ్‌సీల వారీగా నియమితులైన వారంతా వారి ప్రధాన పనిస్థానాల్లోనే రోజూ ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును నమోదు చేయాలన్నారు. పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది ప్రధాన పనిస్థానాల్లో కాకుండా వేర్వేరుచోట్ల హాజరు వేసేలా మ్యాపింగ్ చేసిన వారిని గుర్తించామని, వీరంతా తక్షణమే వాటిని తొలగించాలని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది ఏయే లొకేషన్ల నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేస్తున్నారో నిశితంగా పరిశీలిస్తామని, ఎఫ్‌ఆర్‌ఎస్ మార్గదర్శకాలను ధిక్కరించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఐ ఫోన్లపై హాజరు నమోదు అంగీకరించబోమని పేర్కొన్నారు.

భీమడోలు ఏఎంసీ చైర్మన్‌గా శేషగిరి



భీమడోలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా శేషపు శేషగిరి నియమితులయ్యారు. భీమడోలుకు చెందిన ఈయన 2009 నుంచి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు ఎంపీటీసీగా పని చేశారు. 2014లో మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా సేవలు అందించారు. 2019 నుంచి 2024 వరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. శేషగిరికి ఏఎంసీ చైర్మన్ పదవి రావడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

22 నుంచి పంట కాలువల మూసివేత

- చెరువుల్లో నీటిని నింపేందుకు పొడిగింపు.. పశ్చిమ డెల్టాకు మూడు వేల క్యూసెక్కులు

నరసాపురం/ధవళేశ్వరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : పంట కాలువలు ఈనెల 22నుంచి మూసివేయనున్నారు. రబీ అనంతరం ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా పారేందుకు డెల్టా కాలవల షట్లర్లు, లాకులు వంటి మరమ్మతులు చేపట్టడానికి కాలువలకు నీటి విడుదల నిలిపివేస్తారు. డెల్టా కాలువలు ఈనెల 16నే మూసివేసేందుకు సిద్ధంకాగా గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడానికి ఇతరత్రా అవసరాల కోసం ఈనెల 22 వరకు నీటి విడుదలకు గడువు పెంచారు. ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో కాలువల మూసివేతను 22 వరకు వాయిదా వేశారు. బుధవారం కాటన్ బ్యారేజ్ నుంచి తూర్పు డెల్టాకు



1200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1100 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది.

తెల్లారిన కూలి బతుకులు

ఉపాధి కూలీల పైకి దూసుకెళ్లిన వ్యాన్

ఇద్దరు మహిళల దుర్మరణం

■ లోపలి పేజీలో..



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై అక్రమంగా ఈడీ కేసు చార్జిషీటులో చేర్చడం, నేషనల్ హెరాల్డ్ ఆస్తులను జప్తు చేయడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నాయకులు, కార్యకర్తలు స్థానిక ఇన్‌కంటాక్స్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అక్రమ కేసులకు కాంగ్రెస్ భయపడదన్నారు. నాయకులు బొడ్డు నోబెల్, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, వెంకటరమణ, చక్రవర్తి, దండుబోయిన చంద్రశేఖర్, లంకా రామ్మోహన్, గౌడు రంగబాబు, సుబ్బారావు, కె.ఎస్.ఎన్.మూర్తి, తిలక్, వేల్పుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక కొరత రానీయొద్దు

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా అవసరాలకు అనుగుణంగా ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లభ్యత ఉండేలా పటిష్ట ప్రణాళికలను రూపొందించి ఇసుక కొరత లేకుండా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి గనుల శాఖాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆమె అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో డీసిల్టేషన్ పాయింట్, స్టాక్ పాయింట్ల నుంచి వినియోగదారుల వద్దకు చేర్చేందుకు రవాణా చార్జీలు ఖరారు చేయాలని ఆదేశించారు. డీసిల్టేషన్ పాయింట్, స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక సరఫరాకు వినియోగించే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ విధానం ఉండాలన్నారు. రాబోయే వర్షాకాలం సీజన్‌లో ఇసుక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుకు అనుగుణంగా స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక నిల్వ చేయాలన్నారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఉపరవాణా కమిషనర్ షేక్ కరీం, ఆర్డీవోలు కృష్ణారావు, మదానీ, గనుల శాఖ డీడీ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం పురపాలక సంఘము

ఆర్.ఓ.సి.నెం.39/2025/ఇ1. తేది.16.04.2025

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు ఇ- ప్రొక్యూరుమెంటు ద్వారా టెండరులు పిలువబడుచున్నది.

వ.నెం	పని వివరము	పనుల సంఖ్య	ECV (రూ.లక్షలలో)
1	జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ పరిధిలోని 29 వార్డులలోని వివిధ అభివృద్ధి పనులు(పైపులైన్లు, బోర్‌వెల్స్,డ్రైన్లు & కంప్యూటర్ల సప్లయ్) చేయుట.(జనరల్ ఫండ్స్,15th FC ఫండ్స్)	8	53.5

సంబంధిత వివరములు https://tender.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది.17.04.2025వ తేది ఉదయం గం.10.00ల నుండి చూడవచ్చును. ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

కమీషనర్
జంగారెడ్డిగూడెం పురపాలక సంఘము

7 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



- 11న తిరు కల్యాణ మహోత్సవం
- 12న రథోత్సవం
- 7 నుంచి 14 వరకు ఆర్జిత సేవలు రద్దు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ క్షేత్రం ద్వారకాతిరుమలలో వేంకటేశ్వర స్వామి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 7నుంచి 14 వరకు నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్‌వీ.సత్యనారాయణమూర్తి తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7న ఉదయం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. 8న ధ్వజారోహణ, 10న ఎదుర్కోలు ఉత్సవం, 11న శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 12న రథోత్సవం, 13న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజావరోహణ, 14న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, ద్వాదశ కోవెల ప్రదక్షిణ, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

స్వయం ఉపాధి రుణం మంజూరులో అన్యాయం

ఆకివీడులో దివ్యాంగుడి నిరసన



నిరసన తెలియజేస్తున్న లక్ష్మీ వరప్రసాద్

ఆకివీడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి పథకంలో రుణ మంజూరులో అర్హులకు అన్యాయం జరిగిందని, అనర్హులకు రుణాలు మంజూరు చేశారని వర్ధినేని లక్ష్మీ వర ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుడైన తాను కాపు కార్పొరేషన్ రుణానికి దరఖాస్తు చేసుకున్నా ఎంపిక చేయలేదని ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం మండుటెండలో నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. తనకు రుణం పొందడానికి అన్ని అర్హతలున్నా తనను ఎంపిక చేయకపోగా వైసీపీకి చెందిన వారిని ఎంపికచేసి కూటమి ప్రభుత్వ పాలకులను అధికారులు అవమానించారన్నారు. సుమారు రెండు గంటలు మండుటెండలో ఉన్న ప్రసాద్ వద్దకు అధికారులు వెళ్లి న్యాయం చేస్తామని, ఈ విషయం ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పడంతో ప్రసాద్ ఆందోళన విరమించారు.

ఉల్లి కిలో రూ.10

కర్నూలు, మహారాష్ట్ర నుంచి దిగుమతుల జోరు

దిగొచ్చిన ధర



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏడాదిగా సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న ఉల్లి దిగి వచ్చింది. నిన్నటి వరకూ రూ.30 వరకూ విక్రయించగా ఒక్కసారిగా ధరలు దిగి వచ్చి రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.10కే విక్రయిస్తున్నారు. ఎ గ్రేడు రకం రూ.12 పలుకుతోంది. దీంతో ఉల్లికొనుగోలు చేసేందుకు అన్ని వర్గాల వారు ఆసక్తి చూపుతున్నారు. ఉల్లి దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో మార్కెట్‌కు మహారాష్ట్ర ఉల్లి జోరుగా దిగుమతి అవుతోంది. ప్రస్తుతం తాడేపల్లిగూడెం మార్కెట్‌కు రోజుకు 15 లోడులు దిగుమతి అవుతున్నాయి. దీంతో పెద్ద వ్యాపారులు నిల్వ ఉండే ఉల్లిని కొనేందుకు ఆసక్తి చూపుతూ నిల్వ చేసేందుకు చూస్తున్నారు. ఉల్లి ధర వర్షాకాలం వచ్చేవరకూ నిలకడగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ధర ఎప్పుడు పెంచేస్తారో అని సామాన్యులు సైతం బస్తాలకు బస్తాల ఉల్లి కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఉమ్మడి జిల్లా ఎంపీహెచ్‌ఏ (మేల్)

ఉద్యోగులకు పని సర్దుబాటు!

- మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో విధులు
- సీనియారిటీ ప్రాతిపదికన జాబితా
- ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల
- 260 మందికి డిప్యుటేషన్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో విధుల నిర్వర్తిస్తోన్న ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకునేలా వారిని సర్దుబాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 260 మంది రెగ్యులర్, కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగుల సీనియార్టీ జాబితా రూపొందించి, వాటిపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నిర్ణీత మార్గదర్శకాలకు అనుగుణంగా పని సర్దుబాటు వారం రోజుల్లో పూర్తిచేయాలని డీఎంహెచ్‌వో, డీఎంవోలను ప్రభుత్వం ఆదేశించింది. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం 2022లో ప్రారంభంకాగా, ఈ కార్యక్రమం అమలుకోసం అప్పటి సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ ద్వారా ప్రతీ రెండు గ్రామ/వార్డు సచివాలయాలకు ఒక ఎంపీహెచ్‌ఏ(మేల్) చొప్పున నియమించారు. తాజా నిర్ణయం ప్రకారం వర్క్ అడ్జస్టమెంట్‌లో భాగంగా వారి సేవలను కీటక జనిత వ్యాధుల వ్యాప్తి నియంత్రణ కార్యక్రమాలకు వినియోగించుకునేలా మార్గదర్శకాలను విడుదల చేశారు. ఆ ప్రకారం సీనియార్టీకి అనుగుణంగా కౌన్సెలింగ్ నిర్వహించి తొలి ప్రాధాన్యతగా మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో 2 నుంచి 4 సచివాలయాలకు కలిపి ఒక ఎంపీహెచ్‌ఏ, ఆ తర్వాత అధికంగా డెంగీ వ్యాధివ్యాప్తి చెందే పట్టణ ఆరోగ్య కేంద్రాలకు ఒకరు చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ కేసులు వ్యాప్తి చెందే ప్రాంతాల్లో 2-4 సచివాలయాలకు కలిపి ఒకరు చొప్పున ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఇంకా ఉద్యోగులు మిగిలిపోతే జాతీయ ఫైలేరియా కంట్రోల్ ప్రోగ్రాం సబ్ యూనిట్లు, జిల్లా మలేరియా యూనిట్‌లలో సర్దుబాటు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలకు డిప్యూటేషన్లపై సర్దుబాటు చేసినప్పటికీ, వారందరికీ జీతభత్యాలు మాత్రం ప్రధాన పని స్థానాల్లోనే చెల్లిస్తామని స్పష్టం చేశారు. కాగా ఉమ్మడి జిల్లా సీనియార్టీ జాబితా తయారీ, అభ్యంతరాలు, పరిష్కారం, కౌన్సెలింగ్ ద్వారా సర్దుబాటు ప్రక్రియ పూర్తి కావడానికి 15 రోజులు పడుతుందని భావిస్తున్నారు.

బాలిక మృతికి కారణమైన తండ్రికి జైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కుమార్తె తన వల్ల జన్మించలేదని భార్యను వేధించాడు, ఆపై కుమార్తెను హతమారుస్తానంటూ భార్యతో గొడవపడ్డాడు. అకస్మాత్తుగా ఐదేళ్ల బాలిక పొట్టపై బలంగా తన్నడంతో మృతి చెందింది. నేరం రుజువు కావడంతో ఆ తండ్రికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరు కొత్తగూడెం సెంటర్‌కు చెందిన కాటుమాల రవితేజ (34)కు కనకదుర్గతో వివాహమైంది. వారికి కుమారుడు జశ్వంత్ (3), కుమార్తె రూఫీనా (5) ఉన్నారు. పెళ్లి అయిన నాటి నుంచి రవితేజ తాగుతూ కనకదుర్గను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అంతే కాకుండా కుమార్తె రూఫీనా తనకు జన్మించలేదని, ఆ బిడ్డను ఏనాటికైనా చంపుతానని గొడవ పడుతూ ఉండేవాడు. 2018లో గొడవపడడంతో ఏలూరు వన్ టౌన్ పోలీసులు కేసు కట్టారు. ఎప్పుడు గొడవ పడనని చెప్పడంతో లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేశారు. అదే ఏడాది సెప్టెంబర్ 1న కనకదుర్గతో గొడవపడ్డాడు. ఆ సమయంలో కుమార్తె రూఫీనా తనకు జన్మించలేదని బాలిక పొట్టపై తన్నాడు. దీంతో రూఫీనా విలవిల్లాడుతూ స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే కనకదుర్గ, బాలిక అమ్మమ్మ కలిసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు నిర్ధారించారు. ఈసంఘటనపై ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎ నాగమురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జిల్లా కోర్టులో కేసు విచారణ సాగింది. రవితేజపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూటర్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామారావు వాదించగా అప్పటి సీఐ ఎ.నాగమురళి, వన్ టౌన్ సీఐ సత్య నారాయణ, ఎస్‌ఐ షేక్ బాషా, హెడ్ కానిస్టేబుల్ వైఎన్ మూర్తి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరావు, ఏఎస్‌ఐ సిసిలి సహకరించారు. వారందరిని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అభినందించారు.

ఉద్యాన యూనివర్సిటీ ఉద్యోగులకు

జీతాలు లేవు!



డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో ఉద్యోగుల ఆకలి కేకలు అధికారులకు వినబడడం లేదు. అధ్యాపకులు, సీనియర్ ఉద్యోగులు సైతం వాయిదాల పద్ధతిలో జీతాలు అందుకుంటున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి మరింత దయనీయం. నెలల తరబడి వేతనాలు అందక పూట గడవని స్థితిలో ఉన్నారు. ఉద్యోగులతో పాటు శాస్త్రవేత్తలకు వేతనాలు, పరిశోధనా విద్యార్థులకు (పీహెచ్‌డీ) స్టైఫండ్ అందడం లేదు.

- అధ్యాపకులకు వాయిదా చెల్లింపులు • ఉద్యోగులకు పెండింగ్ • ఔట్ సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి దయనీయం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ సిబ్బంది వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలో జాప్యం, సిబ్బంది అలసత్వంతో ఉద్యోగులు ఇబ్బంది పడగా పరిశోధనా విభాగం కుంటుపడింది. కూటమి ప్రభుత్వం రాగానే అడ్డదారిలో ఉప కులపతిగా నియమితులైన జానకిరామ్‌ను విధుల నుంచి తొలగించారు. సీనియారిటీ ప్రాతిపదికన ఇన్‌చార్జ్ ఉప కులపతిని నియమించారు. విశ్వ విద్యాలయ సిబ్బంది అలసత్వంతో నేటికి గాడిన పడకపోగా చివరికి రెగ్యులర్ ఉద్యోగులకు (శాస్త్రవేత్తలు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, అసిస్టెంట్) జీతాలు అందించలేని దుస్థితికి చేరింది.

పీహెచ్‌డీలకు బకాయి

యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న వారి స్టైఫండ్ బకాయిలు పేరుకుపోయాయి. పీహెచ్‌డీలకు ప్రతీ నెలా చెల్లింపులు లేవు. కొందరు విద్యా సంబంధిత అవసరాలు, వారి ఖర్చులకు స్టైఫండ్ ఆధారం. వారి ఎరియర్స్ చెల్లింపుల మాటే వినిపించడం లేదు.

ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినా..

ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినా సకాలంలో ట్రెజరీకి జీతాల బిల్లులు పంపకపోవడంతో ఏప్రిల్‌లో రెగ్యులర్ ఉద్యోగులు వాయిదా చెల్లింపులతో చెల్లింపులతో సరిపెట్టుకున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి మరి దయనీయంగా మారింది. సుమారు నాలుగు నెలల నుంచి వారి వేతనాలపై లెక్కపత్రం లేకుండా పోయింది. ముఖ్యంగా సెక్యూరిటీ నుంచి అటెండర్ పోస్టుల వరకూ అందరూ సుమారు 400 మందికి 3 నెలల జీతాలు అందక నెలల జీతాలు అందక ఇంటి అవసరాలకు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. పేరుగొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా వర్సిటీ ఉద్యోగుల పరిస్థితి ఉందని సిబ్బంది పెదవి విరుస్తున్నారు.

ఒక నెల ఇస్తే.. మరో నెల ఇవ్వరు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపులో అయోమయం నెలకొంది. గత సంవత్సరం డిసెంబర్ వరకూ జీతాలు అందుకున్నారు. తరువాత జనవరి జీతం లేకపోవడంతో బడ్జెట్ ఇబ్బంది వస్తుందిలే అని సరిపెట్టుకున్నారు. తర్వాత ఫిబ్రవరి జీతాలు అందాయి. మళ్లీ మార్చి వేతనాలు లేవు. సిబ్బంది జీతాల చెల్లింపు విభాగంలో క్రమపద్ధతి లేకుండా వ్యవహరిస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాంక్షన్, నాన్ శాంక్షన్ మెలిక

గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, సిబ్బందిని ఇష్టానుసారం నియమించుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై యూనివర్సిటీ ముఖ్య అధికారులు ప్రభుత్వానికి సరైన వివరాలు అందించారో లేదో కానీ ఆ ఇబ్బంది వల్ల శాంక్షన్ పోస్టులకే బడ్జెట్ విడుదల చేస్తామని ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీనితో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల కోసం ఇంకెన్ని నెలలు ఎదురుచూడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపు సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

నాచుగుంట స్థూపం వద్ద సర్వమత ప్రార్థనలు

స్త్రీ శక్తి పురస్కారం పంపిణీ



స్త్రీ శక్తి పురస్కారం అందుకోనున్న రామలక్ష్మి

ఉంగుటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సర్వోదయ మండలి 65వ ఆవిర్భావ దినోత్సవం నాచుగుంట వద్ద ఈ నెల 18న జరుగుతుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అఖిల భారత సర్వోదయ సమ్మేళనం గుర్తుగా నాచుగుంట వద్ద స్థూపాన్ని ఏర్పాటు చేశారన్నారు. సర్వమత ప్రార్థనలతో పాటు స్త్రీ శక్తి పురస్కారానికి బోయపాటి రామలక్ష్మికి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ప్రసాదరాజు వివరించారు.



డీజీపీ హరీష్ కుమార్ గుప్త నుంచి పురస్కారం అందుకుంటున్న పశ్చిమ పోలీసు అధికారులు

నేర పరిశోధనలో పశ్చిమ పోలీసులు ప్రథమం

ఎస్పీ, సిబ్బందికి ప్రతిష్ఠాత్మక ఏబీసీడీ అవార్డు

భీమవరం క్రైం/ఆచంట/ఉండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి నేతృత్వంలో జిల్లా పోలీసులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉండి మండలం యండగండిలో పార్శిల్ పేరిట మృతదేహం బట్వాడా కేసును స్వల్ప కాలంలో ఛేదించడం ఉన్నతాధికారులు అభినందించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్త నుంచి ప్రతిష్ఠాత్మక ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్) అవార్డును జిల్లా పోలీసు అధికారులు అందుకున్నారు. ఏఎస్పీ వి.భీమారావు, భీమవరం డీఎస్పీ రావూరి గణేశ్ జయసూర్య, ఆకివీడు సీఐ వి.జగదీశ్వరరావు, భీమవరం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్, ఉండి ఎస్‌ఐ ఎండీ. నజీరుల్లా, కాళ్ళ ఎస్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, ఆచంట ఎస్‌ఐ కె.వెంకటరమణ, భీమవరం టూటౌన్ ఎస్‌ఐ రెహ్మాన్ అవార్డులు అందుకున్నారు. నేర పరిశోధన, నేరస్తులను గుర్తించడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆచంట ఎస్‌ఐ వెంకట రమణ డీజీపీ నుంచి అవార్డు అందుకోవడంపై పలువురు అభినందించారు.

ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన ముదునూరి రంగరాజు కుమార్తెలు సాగి తులసికి మృతదేహాన్ని పార్శిల్‌గా పంపించిన కేసును ఛేదించడం ద్వారా పోలీసు శాఖ గౌరవం ఇనుమడించిందని ఎస్‌ఐ నజీరుల్లా తెలిపారు. ఈ కేసులో నేరస్థుడు చిన్న అల్లుడు సుధీర్‌వర్మను సిబ్బంది సహకారంతో స్వల్ప కాలంలో పట్టుకున్నట్లు గుర్తు చేసుకున్నారు.

కల్తీ బెల్లం తయారీ కేంద్రంపై విజిలెన్స్ దాడులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కల్తీ బెల్లం తయారీపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ అధికారి వి శ్రీరాంబాబుకు సమాచారం అందింది. యలమంచిలి మండలం కంచుస్తంభంపాలెంలో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో బుధవారం విజిలెన్స్ ఎస్‌ఐలు కె.సీతారామ్, కె.నాగరాజు, ఆహార తనిఖీ అధికారి సుందరరామిరెడ్డి, సిబ్బంది తనిఖీ చేపట్టారు. కృత్రిమ రంగులు, రసాయనాలు కలిపినట్లు నిర్ధారణ కావడంతో ల్యాబ్ పరీక్షల నిమిత్తం వాటిని సీజ్ చేశారు. అపరిశుభ్రత వాతావరణంలో బెల్లం తయారీ చేస్తున్నందున ఆహార భద్రత చట్ట ప్రకారం కేసు నమోదు చేశారు. రంగులు, రసాయనాలు కలుపుతుండడంతో వారిపై యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. అక్కడ ఉన్న కల్తీ బెల్లాన్ని సీజ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెనుగొండ, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): వడలి - పిట్టలవేమవరం రహదారిలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పెనుగొండకు చెందిన స్వీటు వ్యాపారి కొడుకు తడివాడ భార్గవ్ స్నేహితుడు నంద కిశోర్ ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఎదురుగా వస్తున్న వ్యాన్ బైక్‌ను రాసుకుంటూ వెళ్లడంతో రోడ్డు పక్కన కొబ్బరి చెట్టును ఢీకొన్నారు. భార్గవ్ తలకు బలమైన గాయంతో మృతి చెందాడు. గాయపడిన నంద కిశోర్‌ను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ కె.గంగాధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పై నుంచి జారిపడి..

భీమవరం క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భవనానికి రంగు వేస్తున్న వ్యక్తి జారిపడి మృతి చెందాడు. గాంధీనగర్‌కు చెందిన కురెళ్ళ తాతారావు (56) బుధవారం మారుతీ నగర్‌లో ఇళ్ల వేణుగోపాల్ ఇంటికి రంగు వేసే పనికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని అల్లుడు జవ్వాది సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన తలపాల ప్రశాంత్ (27) అప్పులుచేసి ఇల్లు కట్టాడు. అతని తల్లికి క్యాన్సర్ సోకడంతో వైద్యం నిమిత్తం మరింత అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం కానరాక ఈ నెల 15న రాత్రి పురుగుమందు తాగాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలిస్తుండగా మరణించారు. వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తల్లిదండ్రులు విడిగా ఉంటున్నారని

కుమార్తె ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వేర్వేరుగా ఉంటున్నారని కుమార్తె అల్లు అలేఖ్య (16) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై జబీర్ తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రికి చెందిన అల్లు రవి, నాగదుర్గాదేవి దంపతులు కొంతకాలంగా మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. కుమార్తె అలేఖ్య జంగారెడ్డిగూడెంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ చదువుతుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. తాను మృతి చెందిన తరువాతైనా అమ్మానాన్న కలిసి ఉండాలని లేఖ రాసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దామరచర్ల ఘటనలో పది మంది కోర్టుకు

కుక్కునూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దామరచర్లలో రెండు సామాజిక వర్గాల మధ్య కొట్లాట కేసులో బుధవారం 10 మందిని కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటనలో 28మందిపై కేసులు నమోదయ్యాయి. గ్రామంలో గొడవలు జరగకుండా సీఐ రమేష్‌బాబు, ఎస్సై రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

తెల్లారిన కూలి బతుకులు

ఉపాధి కూలీలపైకి దూసుకెళ్లిన వ్యాన్

ఇద్దరు మహిళల దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మొగల్తూరులో విషాదం
- పోలీస్, రెవెన్యూ సిబ్బంది సహాయక చర్యలు
- సంఘటనా స్థలిని పరిశీలించిన కలెక్టర్, డీఎస్పీ, ఎమ్మెల్యే



కడలి పావని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, గుబ్బల గంగాదేవి మృతదేహం

మొగల్తూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితేకాని డొక్కాడని వారికి కూలి పనులే ఆధారం. ఉన్న ఊరిలోనే ఏదొక పని చేసుకుని బతుకు వెళ్లదీస్తారు. ఎప్పటిలాగే ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్లిన వారి బతుకులే తెల్లారిపోయాయి. పనులు చేస్తుండగా వ్యాన్ రూపంలో మృత్యువు కబళించింది. ఏమి జరిగిందో తెలిసేలోపు ఇద్దరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరో ఇద్దరు కార్మికులు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.

మొగల్తూరు పంచాయతీ పరిధి నల్లంవారి తోట దొడ్డితిప్ప ప్రాంతంలో బుధవారం ఉదయమే జరిగిన సంఘటనతో విషాదం అలుముకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కావారిపాలెంకు చెందిన 15 మంది కూలీలకు ఉపాధి పనుల్లో భాగంగా నల్లంవారితోటలో సుమారు కిలోమీటరు పొడవు గల 46 డీపీ చానల్ పంట బోదె తవ్వకం పని అప్పగించారు. 216 జాతీయ రహదారి వెంబడి ఉన్న పంట బోదెలో కూలీలు పనులు చేస్తుండగా పల్నాడు జిల్లా నరసారావుపేట నుంచి మొగల్తూరుకు వంటనూనె లోడుతో వస్తున్న వ్యాన్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న సైకిల్, ఉపాధి కూలీల మీదుగా పంటబోదెలోకి దూసుకుపోయింది. బోదెలో పని చేస్తున్న కడలి పావని (40), గుబ్బల గంగాదేవి (50) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు కూలీలు గుడాల వీర వెంకట సత్యనారాయణ, మృతురాలు గుబ్బల గంగాదేవి భర్త మాణిక్యాలరావుకు తీవ్రంగా గాయపడ్డారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో సమీపంలో కూలీలంతా ప్రమాదం జరిగిన పంటబోదె వద్దకు పరుగులు తీశారు. గాయపడ్డ మహిళలను బోదెలోంచి బయటకు తీసుకువచ్చారు. వారిద్దరూ అప్పటికే విగతజీవులయ్యారు. మరో ఇద్దరు గాయాలతో ఆర్తనాదాలు చేస్తుండడంతో వెంటనే పోలీస్, 108కు సమాచారం అందించారు. గాయపడిన ఇద్దరిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అధికారుల సహాయక చర్యలు

బోదెలో పడ్డ వ్యాన్ కింద మరికొంత మంది కార్మికులు ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు హైడ్రాలిక్ యంత్రాన్ని రప్పించి వ్యాన్‌ను బయటకు తీశారు. సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ నాగరాణి, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, ట్రైనీ డీఎస్పీ మానస, రూరల్ సీఐ దుర్గా ప్రసాద్, ఎస్‌ఐలు జి.వాసు, నాగలక్ష్మి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, తహసీల్దార్ కె.రాజ్ కిశోర్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వంట నూనె ప్యాకెట్‌లు, నూనె డబ్బాల లోడును పోలీస్ సిబ్బంది స్వయంగా ఖాళీ చేయడంతో హైడ్రాలిక్ యంత్రంతో వ్యాన్ గట్టుకు రప్పించారు. మొగల్తూరు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున సంఘటనా ప్రదేశానికి తరలివచ్చారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్థంబించిపోయింది.

శుభకార్యానికి వెళ్లి..

ఉదయాన్నే పనికి వెళ్లడానికి తెల్లవారు జామునే లేచి ఇంటి పనులు ముగించుకున్నారు. గంగాదేవి, భర్త మాణిక్యాలరావు పనికి వెళుతూ గ్రామంలో ఒక శుభకార్యక్రమానికి వెళ్లి అక్షింతలు వేశారు. దంపతులు ఇద్దరూ కలిసి ఆశీర్వదించిన చివరి ఘట్టం అదే. కడలి పావని అదే శుభకార్యానికి వెళ్లి అక్కడి నుంచి పనికి వెళ్లిన అరగంటలోనే మృత్యువాత పడింది.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

కలెక్టర్ నాగరాణి, విప్ నాయకర్

ప్రమాదస్థలిని కలెక్టర్ నాగరాణి, ప్రభుత్వ విప్ నాయకర్ పరిశీలించారు. నరసాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు తెలుసుకున్నారు. గుబ్బల మాణిక్యాలరావును మెరుగైన వైద్యం కోసం భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తలకు గాయాలైన గుడాల సత్యనారాయణకు స్కానింగ్ తీయించి నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స చేయిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. కలెక్టర్, విప్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇద్దరు మహిళా కూలీల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున గాయపడ్డ కూలీలకు ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున నష్టపరిహారం అందజేస్తామని డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు తెలిపారు. చంద్రన్న బీమా పథకం నుంచి మృతుల కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు చొప్పున నష్టపరిహారం అందించే అవకాశం ఉందని ఆయన వివరించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:207821

పాఠకులకు ముఖ్య గమనిక
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిబిటి

కొత్త పట్టిసీమలో మద్యం లోడు వాహనం బోల్తా



మద్యం లోడుతో బోల్తాపడిన వాహనం

పోలవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త పట్టిసీమ వద్ద బుధవారం మద్యం లోడుతో వెళుతున్న మినీ వ్యాన్ బోల్తాపడింది. కొవ్వూరు వైపు నుంచి పోలవరం మద్యం లోడుతో వస్తున్న వాహనం పట్టిసీమ ఇసుక ర్యాంపు సమీపంలో మలుపు వద్ద బోల్తాపడడంతో మద్యం సీసాల బాక్సులు నేలపాలయ్యాయి. కొన్ని మద్యం సీసాలు, బీరు కేసులు పగిలిపోయాయి. మద్యం షాపు నిర్వాహకులు సంఘటనా స్థలానికి చేరుకుని మిగిలిన సీసాలను మరో వాహనంలో తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డారని, రూ.7 లక్షల విలువైన మద్యం లోడులో 30శాతం నష్టపోయినట్లు షాపు నిర్వాహకులు తెలిపారు. రెండేళ్ల క్రితం ఇదే మలుపు వద్ద కారు బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ప్రమాదాలు జరిగే ప్రాంతమని పోలీసులు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్ల డ్రమ్ములు ఏర్పాటు చేశారు. అవి పోవడంతో మళ్లీ ప్రమాదాలు జరుగుతున్నాయి.

విద్యుత్ సరఫరా వేళల్లో నేడు మార్పులు

టి.నర్సాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులకు వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ బుధవారం తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా టి.నర్సాపురం, గండివారిగూడెం, మక్కినవారిగూడెం, తిరుమల దేవిపేట, మధ్యాహ్నపువారిగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పీర్ అహ్మద్ ఖాన్ కోరారు.

నేడు మాదేపల్లిలో రీ సర్వే గ్రామసభ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : మాదేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు రీ సర్వే గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ సభకు సంబంధిత అధికారులు విచ్చేస్తారని తెలిపారు. గ్రామంలో భూములున్న రైతులంతా గ్రామసభకు హాజరుకావల్సిందిగా గ్రామ సర్వే టీమ్ సభ్యులు తెలిపారు.

ముగిసిన రాట్నాలమ్మ ఉత్సవాలు



పెదవేగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : రాట్నాల కుంటలో కొలువైన రాట్నాలమ్మతిరునాళ్లు బుధవారంతో ముగిశాయి. రాట్నాలమ్మ శ్రీరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆకలి తీర్చే అన్నపూర్ణగా దర్శనమిచ్చిన శ్రీరాట్నాలమ్మను భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం ఉదయం 6గంటలకు విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపారాధన, పరివార దేవతార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. ముందుగా శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి శాంతి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రి 9గంటలకు సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్ కుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామాల్లో లయన్స్ సంస్థ దుకాణాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలకు అతి తక్కువ ధరకే కిరాణా సరుకులు అందించడానికి లయన్స్ సంస్థ దుకాణాలు ఏర్పాటు చేస్తోందని సంస్థ ఏపీ అధ్యక్షురాలు సంధ్య తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి షాపును ద్వారకాతిరుమల స్వామి క్షేత్రంలో ప్రారంభిస్తామని తెలిపారు. లయన్స్ సంస్థ ఇప్పటికే దేశంలోని రాజస్థాన్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను నిర్వ హిస్తోందన్నారు. ఏపీలో ఈ నెలాఖరుకు లయన్స్ సంస్థ వ్యాపారాన్ని ప్రారంభిస్తుందని సంధ్య వివరించారు. యువతకు శిక్షణనిచ్చి వ్యాపార భాగస్వామిగా పనిచేసి తయారీ రంగంలో యువతకు ఉపాధిని కల్పించేందుకు లయన్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోజ్ జాంగ్ర రూపకల్పన చేశారన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

బుట్టాయగూడెం, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి) : పోడు వ్యవసాయ భూములకు పట్టాలివ్వాలని, రోడ్డు,విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ గిరిజనులు కె.ఆర్.పురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ఏలేరుపాడు మండలం గుండ్లమడుగు గ్రామానికి చెందిన గిరిజనులు పాల్గొన్నారు. 70 మంది ఆదివాసీ రైతులు 250 ఎకరాల్లో పోడు వ్యవసాయం చేస్తున్నారని నేటికి పట్టాలివ్వలేదన్నారు. గుండ్లమడుగు గ్రామానికి నేటికి సరైన రోడ్డు మార్గం లేదని గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులు టి.శ్రీనివాసరావు, పి.ప్రకాశ్‌లకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు బి.వినోద్, ఎం.సీతారాములు, పి.వెంకటేశ్, కె.సుబ్బారావు, కె.మల్లయ్య, కె.సత్యవతి, కె.కల్పన, కె.వెంకటలక్ష్మీ, సత్యవతి పాల్గొన్నారు.

ఉపాధి బకాయి వేతనాలు విడుదల చేయండి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికులకు గత రెండు నెలలుగా చెల్లించాల్సిన బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా నేత ఆర్.లింగరాజు హెచ్చరించారు. పంగిడిగూడెంలో జరుగుతున్న ఉపాధి పనులను సీపీఎం బృందం బుధవారం పరిశీలించింది. అనంతరం లింగరాజు మాట్లాడుతూ తక్షణమే బకాయిలు విడుదల చేయకుంటే కూలీలను సమీకరించి పోరుకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన

పోలవరం, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి) : పోలవరం, పట్టిసీమ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల గ్రామ సభలు బుధవారం నిర్వహించినట్టు మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. వరికి క్వింటాలుకు రూ.2,300, గ్రేడ్-ఎ రకానికి రూ.2,320 అని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.సాయిరాజు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొణతాల ప్రసాద్, మండల కన్వీనర్ గునపర్తి చిన్ని, టీడీపీ మండల కన్వీనర్ బొడ్డు కృష్ణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయం విరమించుకోండి

పోలవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయం విరమించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో పోలవరం సబ్ స్టేషన్‌ను ముట్టడించి ధర్నా చేశారు. అనంతరం సబ్ స్టేషన్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాన్యులపై విద్యుత్ భారాలు మోపడం దారుణమన్నారు. అలాగే వేసవిలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బొరగం భూచంద్రరావు, మడివి చలపతిరావు, గోకూరి పాండవులు పాల్గొన్నారు.

జాలిపూడిలో వైభవంగా అమ్మవార్ల జాతర

ఏలూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గంగానమ్మ నామస్మరణతో జాలిపూడి గ్రామం మార్మోగింది. గ్రామంలో 12 ఏళ్ల కొకసారి జరిగే అమ్మవారి జాతర 32 ఏళ్ల తరువాత బుధవారం ప్రారంభమైంది. జాతర ఘట్టాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. తెల్లవారుజామున గ్రామంలోని మహిళలు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో, కలశాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి అభిషేకం అనంతరం కనక మేడలో నిలబెట్టారు. గంగానమ్మ, ఆది మహాలక్ష్మీ, వినుకొండ అంకమ్మ, పోతురాజుబాబుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1993లో 9 రోజుల పాటు జాతర జరిగిందని, ఇప్పుడు 32 ఏళ్ల తరువాత జాతర తిరిగి ప్రారంభించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే చింతమనేని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నంబూరి నాగరాజు, నెక్స్ట్ జెన్ ఫీడ్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, గొడవర్తి శివశంకరరావు, నేతల రవి పాల్గొన్నారు.

హెచ్ఎం, ఉపాధ్యాయులకు ఐఐటీ ప్రొఫెసర్ ప్రశంస

కామవరపుకోట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : రావికంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల సేవా కార్యక్రమాలను ఢిల్లీకి చెందిన ఐఐటీ ప్రొఫెసర్, గేట్-2025 చైర్మన్ జి.ప్రకాశ్ బుధవారం అభినందించారు. హెచ్ఎం భీమరాజుకు, ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావులను సోషల్ మీడియా వేదికగా అభినందించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, ఎంపీటీసీ కనుమూరి అంజిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ బేతిన శ్రీను, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీను, రెవెన్యూ పరిపాలన అధికారి ముళ్ళపూడి ప్రవల్లికలు అభినందనలు తెలిపారు.

ఆయుష్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : గతంలో క్యాన్సర్‌ను జయించిన 69 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన పరిస్థితుల్లో శస్త్ర చికిత్సను ఏలూరు ఆయుష్ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి బుధవారం మాట్లాడుతూ గతంలో క్యాన్సర్ శస్త్రచికిత్సలు జరిగిన వృద్ధురాలికి కాలేయంపై అనుమానాస్పద గడ్డ ఏర్పడిందన్నారు. అత్యాధునిక విధానంలో కాలేయ గడ్డలను తొలగించామన్నారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకున్నట్టు ఆస్పత్రి మేనేజర్ తెలిపారు.

కొమ్ముగూడెంలో పొగాకు బ్యారన్ దగ్ధం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : కొమ్ముగూడెంలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఆలపాటి వెంకట రమణమూర్తికి చెందిన వర్జీనియా పొగాకు బ్యారన్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు 7 లక్షల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. పొగాకును క్యూరింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు రైతు తెలిపారు. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు.

కార్మికుల సమస్య పరిష్కరించిన సీఐ అశోక్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికురాలి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఒక వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ పారిశుధ్య కార్మికులు, సెక్యూర్టీ గార్డులు నిరసనకు దిగారు. దీంతో ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, చర్చించి సమస్యను పరిష్కరించారు. తాను ఆసుపత్రి అడ్వైజర్ కమిటీ సభ్యుడినని కిలారి జగదీష్ ఆస్పత్రిలోని పారిశుధ్య కార్మికులు, సెక్యూర్టీ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించడంతో కార్మికులు నిరసనకు దిగారు. ఇరువురిని స్టేషన్‌కు తీసుకెళ్లి చర్చించి సమస్యను పరిష్కరించారు. ఆసుపత్రిలో ఇకపై గొడవలు జరిగితే కేసులు నమోదు చేస్తామని జగదీష్‌ను సీఐ హెచ్చరించారు.

ఈ గోతులతో వేగలేం..

పలు గ్రామాల ప్రజల ఆందోళన

చింతలపూడి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి కేంద్రంగా పది కిలోమీటర్ల పరిధిలో ఏ రోడ్డు చూసినా గోతులతో అధ్వానంగా మారాయి.ఈ రోడ్లపై ప్రయాణం చేయలేమంటూ ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. చింతలపూడి నుంచి గురుభట్లగూడెం, మల్లాయిగూడెం వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. అలాగే సీతానగరం మార్గంలో ఎర్రగుంటపల్లి వరకు, తెలంగాణ సరిహద్దులో అల్లిపల్లి నుంచి ఆంధ్రా సరిహద్దు మందలపల్లి వరకు గోతులమయంగా మారాయి.మరోవైపు టి.నర్సాపురం మార్గంలో చింతలపూడి శివారున రోడ్డు పక్క భారీగా చెత్త డంపింగ్ వేయడంతో వాహనదారులు దుర్వాసన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చింతలపూడి నుంచి టి.నర్సాపురం వరకు రోడ్డు గోతులమయంగా మారింది. చింతలపూడి-ఏలూరు రోడ్డులో ఫాతిమాపురం



చింతలపూడి - గురుభట్లగూడెం, టి.నర్సాపురం రోడ్ల దుస్థితి

నుంచి వెలగలపల్లి మొక్కజొన్న ఫ్యాక్టరీ వరకు రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. ఫాతిమాపురం నుంచి చాట్రాయి రోడ్డు, ప్రగడవరం రోడ్డు, బాలువారిగూడెం రోడ్ల పరిస్థితికూడా వర్ణనాతీతం. చింతలపూడి పట్టణంలోని మెయిన్ రోడ్డులో మాత్రమే పాక్షికంగా గోతులు పూడ్చి వదిలేశారు.ఈ గోతుల కారణంగానే ఆర్టీసీ సైతం బస్సులు తిప్పడం లేదు. ఈ వేసవిలో అయినా రోడ్లను బాగు చేయాలంటూ ప్రజలు కోరుతున్నారు.

గోతులు పూడ్చాలి : ఆర్.వి.సత్యనారాయణ



టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గోతులు పూడుస్తామన్నారు. చింతలపూడి మండలంలో ఏ మార్గంలోను గోతులు పూడ్చలేదు. రోడ్లు మెరుగుపడలేదు. ప్రజలు కూడా వేచి చూస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణ చర్యలు తీసుకోవాలి.

ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశాం : నాజర్ బాషా



టి.నర్సాపురం-చింతలపూడి రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ గోతుల్లో వెళ్లాలంటే నరకం కనిపి స్తోంది. పది నెలలైనా రోడ్డు వేయకపో వడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో ఏ విధంగా ఉన్నా యో, ఇప్పుడు అదే విధంగా ఉన్నాయి. కొత్త రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశాం.

సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ప్రజా ప్రతినిధులు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

దెందులూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : సోమవరప్పాడు గ్రామంలో ఉపాధి నిధులు రూ.74 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కలిసి ప్రారంభించారు. ముందుగా అదే గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఏఎంసీ చైర్మన్ మాగంటి సూరేంద్రనాథ్ చౌదరి, టీడీపీ మండలాధ్యక్షుడు మిల్లుబాబుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో శ్రీదేవి, మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు కర్రి రంగారావు, నాయకులు మాగంటి గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, నాయకులు గారపాటి కొండయ్య చౌదరి, మాగంటి నారాయణ ప్రసాద్, బొప్పన సుధా, నంభూరి నాగరాజు, లావేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే రోషన్...

లింగపాలెం : అభివృద్ధే లక్ష్యంగా నాయకులు, అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ధర్మాజీగూడెంలో భవిత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ సమగ్రశిక్ష అధ్వర్యంలో 14మంది దివ్యాంగ విద్యార్థులకు 2లక్షల ఐదువేల రూపాయలకు పైగా విలువైన ఉచిత సహాయ ఉపకరణాలు అందించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. సమస్యలపై 101 అర్జీలు రాగా వాటిని వెంటనే పరిష్కరించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వాణి, తహసీల్దార్ ప్రసాద్, జి.చలపతిరావు, ఎం.మల్లికార్జునరావు, జె.ముత్తారెడ్డి, జి బుజ్జయ్య, ముసునూరి రాము పాల్గొన్నారు.



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్

బుట్టాయగూడెంలో బొరగం అర్జీల స్వీకరణ..

బుట్టాయగూడెం : ఏపీ ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు బుధవారం బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రోడ్లు, మంచి నీరు, ఆర్అండ్ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర సమస్యలపై ప్రజలు, నిర్వాసితులు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం బొరగం మాట్లాడుతూ ప్రతి సమస్యను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అనపర్తి వెంకట నారాయణ, మొగపర్తి సోంబాబు, మొడియం సింగ రాజు,పి.భీమేశ్వరరావు, జి.రాంబాబు, మడకం రామకృష్ణ, తెల్లం వెంకటేశ్వరరావు, గంటా సతీశ్ పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న చంటి, రెడ్డిఅప్పలనాయుడు

విజయవాడకు కొత్త బస్సులు ప్రారంభం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : ప్రజల విజ్ఞప్తి మేరకు కొత్త బస్సులు ప్రారంభించినట్టు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు ఆర్టీసీ డిపోలో బుధవారం నుంచి విజయవాడకు నాన్‌స్టాప్ సర్వీసుగా కొత్త ఆల్ట్రాడీలక్స్ బస్సును ఎమ్మెల్యే చంటి, విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడులు జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటి వరకు 12 కొత్త సర్వీసులను, అనేక కొత్త బస్సులను ప్రారంభించినట్టు తెలిపారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేతో కలిసి మరిన్ని సౌకర్యాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి.మురళీ, స్టేషన్ మేనేజర్ కుమారి, పీఆర్వో నరసింహం పాల్గొన్నారు.

సగరలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : సగర సామాజిక రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి పేర్కొన్నారు. ఇటీవల ఏలూరు జిల్లా సగర్ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కుప్పాల ఆంజనేయులును బుధవారం ఏలూరులో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 70వేల మంది సగర్లు ఉన్నారని వారికి రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడిశెట్టి గోపి మాట్లాడుతూ సగర్లను బీసీ - డీ నుంచి ఏకు మార్చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, పామర్తి ఏసురాజు, డి.వెంకటరావు, జరజాపు రాఘవ, వై.నాని, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడానికే చలివేంద్రం

టి.నర్సాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని తహసీల్దార్ సాయిబాబా అన్నారు. బొర్రంపాలెంలో స్వచ్ఛసేవా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పెండ్యాల అభిషేక్ బాబు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. జయబాబు, దాసరి ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వీఆర్వో అడపా సుబ్బారావు, పాండురంగ, రాజబోయిన రమేశ్, బి.రమేశ్, జోగేశ్వరరావు, మోషే, కొనకళ్ల సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

ఏలూరు రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైఎంహెచ్ఏ ప్రాంగణంలో కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. వైఎంహెచ్ఏ ప్రాంగణంలో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుప్తా ఫౌండేషన్ ట్రస్టు సహకారంతో పౌరాణిక నటులు ఎం.సూర్యనారాయణ యాదవ్, జానపద కళాకారులు మిరియాల శేఖర్‌బాబు, డొలకిట్టు కూతిసాయి బాబు, భజన కళాకారిణి అనుపోజు భవానీలను ఆర్థికంగా,రోషన్ పట్టాభివర్మకు గౌరవంగా సత్కరించారు. అనంతరం నాట్యాచార్య కె.వి.సత్యనారాయణ, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణల ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం, హరిశ్చంద్రుడి ఏక పాత్రాభినయాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కెవి సుబ్బారావు, గంటికోట రాజేష్, ఎ.గోవిందరావు, ఎండి ఖాజావలీ, జి.పెద్దిరాజు, పి.రామకృష్ణ పర్యవేక్షించారు.



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాసమస్యలను ఒకొక్కటి పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివ ప్రసాద్, బెల్లకొండ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

ఉంగుటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని ఉంగుటూరు తహసీల్దార్ పాలపర్తి రవి కుమార్ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష రాజకీయ నాయకులతో సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ఎన్నికల ప్రక్రియను సక్రమంగా జరిగేలా చూడాలని వివరించారు. సమావేశంలో నాయకులు పాతూరి విజయకుమార్, అడపా శోభారాణి, నగరపాటి సత్యనారాయణ, గుత్తికొండ వెంకట కృష్ణారావు, డి.టి.పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఏఎస్ఐ అమీర్ తెలిపిన వివరాల ప్రకారం పంగిడిగూడెంలో నివాసముంటున్న తడపల ప్రశాంత్(30) మంగళవారం రాత్రి అప్పులు తీర్చలేక పురుగుమందు తాగినట్లు భార్యతో చెప్పి సొమ్మిసిల్లి పడిపోయాడు. ఆమె హుటాహుటిన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించింది. చికిత్స పొందుతూ ప్రశాంత్ మృతి చెందడంతో భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. ప్రశాంత్ స్వగ్రామం భీమడోలు కాగా ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్టు చెప్పారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : ఏఆర్‌బీజీకే పాఠశాల విద్యార్థులు ఇటీవల మణిపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించారని ఆ పాఠశాల హెచ్.ఎం. బి.చరణ్ ఉజ్వల తెలిపారు. చుక్కా కీర్తన 59, 67, 87 విభాగాల్లో 154 కేజీల బరువు ఎత్తి రజిత పతకం, ఎం.పావని మొత్తం 102 కేజీలు ఎత్తి తృతీయ బహుమతి సాధించారని తెలిపారు. ఈ మేరకు విజేతలను పాఠశాలలో అభినందించారు.

వసతి గృహానికి ఆర్వో ప్లాంట్

ఏలూరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం వసతి గృహానికి ఏలూరు యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం తరపున వాటర్ ప్లాంట్ బహూకరించారు. ఏలూరు యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నాంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ప్లాంట్‌ను అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహం ప్రిన్సిపల్ పీహెచ్ శ్రీనివాసరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

టి.నర్సాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విశ్వతేజ స్కూల్ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. కామవరపు కోటలో పిల్లలను ఎక్కించుకుని టి.నర్సాపురం మండలం తెడ్లం గ్రామం వెళ్లి పిల్లలను దించి తిరిగి రాజుపోతేపల్లి వస్తుండగా మార్గ మధ్యలో స్టీరింగ్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 10 మంది ఉండగా అంతా సురక్షితంగా బయటపడటంతో చిన్నారుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎత్తిపోతలను పూర్తి చేస్తాం : ఎంపీ

చింతలపూడి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారానికి చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రానున్న మూడేళ్లల్లో పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పేర్కొన్నారు. చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం జరిగిన సమావేశంలో గోద్రేజ్ కంపెనీ సమకూర్చిన పది లక్షల రూపాయలు విలువైన పరికరాలను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సమక్షంలో ఎంపీ ఆస్పత్రి యాజ మాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణరావు, నాయకులు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

● పెదవేగి : కేంద్రం ఇచ్చే నిధులతో ఏలూరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టామని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ అన్నారు. రూ.3 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయనున్న గోపన్నపాలెం- రామశింగవరం ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధికి సంబంధించి ఎంపీ మహేష్ యాదవ్‌తో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, గారపాటి రామసీత, మేకా కనకరాజు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, యశ్వంత్ పాల్గొన్నారు.



సామగ్రి అందజేస్తున్న ఫ్యాక్టరీ పీఆర్వో రాఘవరావు

పీహెచ్‌సీకి భారీగా సామగ్రి అందజేత

జీలుగుమిల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బుధవారం నవ భారత్ ఏఎస్ చౌదరి ఫౌండేషన్ ద్వారా రూ.5 లక్షల విలువ చేసే కంప్యూటర్, ఫ్రిజ్, ఏసీ, బీరువాలు, కుర్చీలు, ఫ్యాన్‌లు వైద్యాధికారి పి.గాయత్రికి అందజేశారు. జంగారెడ్డిగూడెం నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ పీఆర్‌వో ఏవి.రాఘవరావు మాట్లాడుతూ ఎస్ఎస్ చౌదరి ఫౌండేషన్ ద్వారా పోలవరం నియోజకవర్గంలో రూ.45 లక్షల విలువ చేసే సామగ్రిని ఆయా ఆస్పత్రులకు అందజేశామన్నారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్, కొండపల్లి ప్రసాద్, గారపాటి శ్రీను, ఆస్పత్రి సిబ్బంది ఎల్‌టీ.మంగతాయారు, కూరం ప్రసాద్ ఉన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దెందులూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : ఆలిండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ కాంపిటీషన్ చిత్రలేఖనం పోటీల్లో అప్పనవీడు ప్రభుత్వ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గోల్డ్ మెడల్స్ సాధించిన 10 మందిని, వెండి మోడల్స్ సాధించిన ఏడుగురు విద్యార్థులను బుధవారం అధికారులు అభినందించారు. హెచ్ఎం పుష్పావతి మాట్లాడుతూ విజయవాడలో జరిగిన ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థులు ఈ మెడల్స్ సాధించినట్టు తెలిపారు. పెదపాడు ఎంఈవో సి.నరసింహమూర్తి, వెంకట రమణ విద్యార్థులను అభినందించారు.

సేంద్రియ వ్యవసాయంతో రైతుకు మేలు

ఉంగుటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : సేంద్రియ సాగు ద్వారా రైతులు మంచి భవిష్యత్తును కోరుకుంటున్నారని జిల్లా ప్రకృతి వ్యవసాయాన్ని అధికారి బాలిన వెంకటేశ్ అన్నారు. బుధవారం గోపాలపురం రైతుల సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట వేసి పాల ఉత్పత్తులను పెంచవచ్చన్నారు.

మూడు గ్రామాల్లో ఫీవర్ సర్వే

ఉంగుటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దోమల నుంచి ప్రజలు రక్షణ పొందాలని,పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వై.వి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎర్రమళ్ల, నీలాద్రిపురం,నాచుగుంట గ్రామాల్లో డ్రైడే నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మి, అమరావతి, రమాదేవి, మరియమ్మ, మాలతీ రత్న కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పెదపాటికి పురస్కారంపై హర్షం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : సాహిత్య మండలి సభ్యులు సాంఘిక నాటక రచయిత, దర్శకులు పెదపాటి రామకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వం కందుకూరి వీరేశలింగం విశిష్ట పురస్కారాన్ని అందజేయడం పట్ల సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి కుల్లా కోట్ల పురుషోత్తం హర్షం ప్రకటించారు. పెదపాటి రామకృష్ణ ఏలూరులో ఎన్నో సాంఘిక నాటకాలు ప్రదర్శించడమే కాకుండా హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా కళారంగానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం

ఏలూరు రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లాలో వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడ సాధికార అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ శిబిరాల నిర్వహణకు ఏలూరు పరిధిలో ఉన్న క్రీడా అసోసియేట్‌లకు, పీఈటీలు క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తును పూర్తి వివరాలతో ఈనెల 19వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అందజేయాలని విజ్ఞప్తి చేశారు. 8 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలకు ఈ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

కామవరపుకోట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ మిగులు భూములు, అటవీ మిగులు భూములు పంపిణీ చేయాలని సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు తెలిపారు.బుధవారం పాతూరులో జరిగిన సీపీఐ గ్రామ సభకు కంకిపాటి జయరాజు అధ్యక్షత వహించారు. రాజు మాట్లాడుతూ దేశంలోని బ్యాంకుల జాతీయకరణ, భూసంస్కరణల చట్టం తీసుకురావడం కోసం సీపీఐ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపర్చకపోగా విభేదాలు సృష్టించి దేశాన్ని మత రాజ్యంగా మార్చాలని చూస్తోందని అన్నారు. కార్యక్రమంలో కొండేపూడి అన్నమేరి, స్వామిదాసు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌పై హర్షం

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఆర్డినెన్స్‌ను తేవడం పట్ల ఎంఆర్‌పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్ నేతలు ఎమ్మెల్యే చంటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల అన్ని ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. అందుకే సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తూ ఆర్డినెన్స్ తెచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు బయ్యారపు రాజేశ్వరరావు, జుంజు మోజేష్, కాశీకృష్ణ, ఐ.మాధవరావు, సీహెచ్ సాయిబాబా, తోటకూర రవి, బయ్యారపు కుటుంబరావు, పరసా చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కుక్కునూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : కుక్కునూరు ఎస్సీ సంక్షేమ హాస్టల్లో వంట పని చేసిన బుయ్యాన భద్రం ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ క్రమంలో అదే హాస్టల్‌లో ఉండి చదువుకున్న పూర్వవిద్యార్థులు భద్రం కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. వార్డెన్ విజయ భాస్కరరావు సహకారంతో పూర్వపు విద్యార్థులు రాయి రవి, సంజీవరావు, పెంకే రమేశ్, బల్లెం వెంకటేశ్వర్లు, పోతురాజు, వీరబాబు సహకారంతో రూ.15 వేలు అందజేశారు.



కార్డులు అందుకున్న టీడీపీ నాయకులు

టీడీపీ సభ్యత్వ కార్డుల అందజేత

కుక్కునూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : కుక్కునూరు మండల కేంద్రంలో బుధవారం టీడీపీ సభ్యత్వ కార్డులను నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. ప్రతి ఒక్కరికీ టీడీపీ సభ్యత్వ కార్డు వలన మేలు జరుగుతుందని పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటగిరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ పి.రాజు, శ్రీనివాస్, రమణరాజు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

చింతలపూడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలో ఇప్పటికే 45 మందికి ఉద్యోగాలిచ్చామని, ఈ రోజు జరిగిన జాబ్ మేళాలో 76 మందికి నియామక పత్రాలు ఇచ్చినట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాకు 247 మంది హాజరవగా 76 మందికి ఉద్యోగాలిచ్చామన్నారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
నూజివీడు, కైకలూరు
7 www.andhrajyothy.com ● గురువారం 17 ఏప్రిల్ 2025

రహదారి మరమ్మతులకు నిధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉన్న పెదలంక - మూల్లంక రహదారి మరమ్మతులకు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ ఏఈఈ అరవింద్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 12న ప్రచురితమైన 'అకాల వర్షంతో రహదారి జలమయం' కథనానికి అధికారులు స్పందించారు. పెదలంక నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు త్వరలో చేపడతామన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

ఆగిరిపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జగన్మోహనరావు బుధవారం ఆగిరిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో క్లాస్ లీడర్స్‌ను గుర్తించి వారికి యూనిఫాం అందించారు. వారు క్లాస్ రూమ్‌లో సహచర విద్యార్థుల పట్ల క్లాస్ లీడర్‌గా ఏవిధంగా ప్రవర్తించాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పులి పుష్పలత, ఎంపీహెచ్‌ఈవో జి.రత్నబాబు పాల్గొన్నారు.



పెదపాలపర్రు పాఠశాలలో వార్షికోత్సవ కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా మండల పరిషత్ పాఠశాల వార్షికోత్సవం

ముదినేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెద పాలపర్రులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. హెచ్‌ఎం రఘురామయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు కేక్ కట్ చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయినీ జయలక్ష్మి పాల్గొన్నారు.

సంపద సృష్టిపై క్లాప్ మిత్రలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కాప శ్రీనివాసరావు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండల పరిధిలోని కొత్త రావిచర్ల గ్రామంలో బుధవారం సందప సృష్టి కోసం క్లాప్ మిత్రలకు శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్, గ్రామ సర్పంచ్ కాపా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రం చేయడం, చెత్తను సంపద సృష్టి కేంద్రానికి తరలించడం, అక్కడ సంపదను సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుడు తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ చెత్త సేకరించే విధానం, సంపద సృష్టి ఎలా జరుగుతుందో తెలియజేశారు. డీఎల్‌పీవో సుందరి మాట్లాడుతూ గ్రామాల పురోభివృద్ధిలో కొత్త రావిచర్ల గ్రామం ఆదర్శవంతంగా నిలుస్తుంది అన్నారు.

పంచాయతీలకు ఆదాయం పెంచాలి

కైకలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచాలని ఈవోపీఆర్డీ కొండలరావు అన్నారు. బుధవారం కైకలూరు మండలం ఆటపాకలో చెత్తసంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, క్లాప్ మిత్రలకు శిక్షణ నిర్వహించారు.

డేటా ఎంట్రీ పూర్తి చేయాలి

కైకలూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నీటి తీరువ పన్నులు డేటా ఎంట్రీని వేగవంతంగా పూర్తిచేయాలని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. బుధవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ నీటి తీరువ డేటా ఎంట్రీ పనులను మరో రెండు రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. డేటా ఎంట్రీ పూర్తిఅయిన గ్రామాల్లో శిస్తు వసూళ్ల పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముదినేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థులు మే 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ముదినేపల్లి ఎంపీడీవో వై రామకృష్ణ తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 21 నుంచి 50 సంవత్సరాలలోపు ఉండాలని, ఆసక్తి కలిగిన వారు రైస్‌కార్డు, ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు.

కట్నం వేధింపుల కేసు

ముదినేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీకి చెందిన లతకు ముదినేపల్లికి చెందిన మణికాంత్‌కు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కొంత సొమ్ము కట్నంగా ఇచ్చారు. అయితే కొంత కాలంగా ఆమెకు పుట్టింటి నుంచి మరికొంత సొమ్ము తెమ్మని భర్త, అత్త వుధించడం మొదలైంది. ఈ వేధింపులు భరించలేక ఆమె బుధవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వీరభద్రరావు కేసు నమోదు చేశారు.

ఎక్సైజ్ దాడులు

చాట్రాయి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేటలో బుధవారం కార్డెన్ సెర్చ్ చెయ్యగా 300 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. పోతనపల్లి చిన్న తండాలో జరిపిన దాడిలో 500 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేశామని చెప్పారు. నేర స్థలాల నుంచి పారిపోయిన పరసా నాగేశ్వరరావు, వడిత్యా బిక్షాలుపై కేసులు నమోదు చేశామన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్చ

మండవల్లి ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండవల్లిలో కొంతమంది ప్రభుత్వ, పోరంబోకు భూములు ఆక్రమించుకుని నెంబర్లు మార్చి తమ పేరున రిజిస్టర్ చేయించుకుంటున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి బాస్కరరావు, జిల్లా కన్వీనర్ అప్పారావు పేర్కొన్నారు. మండవల్లి సచివాలయంలో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఆక్రమణ విషయాన్ని కొందరు గ్రామస్తులు ఎంపీడీవో రామలింగేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు.

బాలిక సంరక్షణ కమిటీకి అప్పగింత

కలిదిండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గోపాలపురంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్, పోలీసు, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నట్లు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. మచిలీపట్నంకు చెందిన బాలిక (14)ను కలిదిండి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన వర్రే శ్రీనివాసరావు ఈ నెల 12న కలిదిండి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నాడు. బుధవారం గోపాలపురంలో శ్రీనివాసరావు ఇంటి వద్ద సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకుంటుండగా, 1098కు కాల్ చేసి సమాచారం అందించటంతో అధికారులు గోపాలపురం వెళ్లి అడ్డుకున్నారు. బాలికను అదుపులోకి తీసుకుని ఏలూరు బాలిక సంరక్షణ కమిటీకి అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు ప్రసూన, నాగలక్ష్మీ, డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ముసునూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను మండల పరిషత్ పాఠశాలల్లో చేర్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చూడాలని ఎంఈవో బి.వి.యస్ సుబ్బారావు అన్నారు. బుధవారం ముసునూరులో జరిగిన అంగన్‌వాడీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఇంటింటి ప్రచారం చేయాలన్నారు.

అగ్నిప్రమాదం

నూజివీడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలోని ఆటోనగర్ మార్గంలో రహదారికి ఇరువైపులా చెత్త పోయటం పరిపాటి. బుధవారం ఈ చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ప్రజలు అగ్నిమాపక దళానికి తెలియజేయటంతో వెంటనే స్పందించి వారు మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వాడవల్లి యూపీలో కొత్త అడ్మిషన్లు

ముదినేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వాడవల్లిలోని మండల పరిషత్ యూపీ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి కొత్త అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో బుధవారం ఆ పాఠశాలలో నలుగురు విద్యార్థులు చేరగా, వారికి హెచ్‌ఎం సాయిలక్ష్మీ అడ్మిషన్ పత్రాలు అందజేశారు. ఎస్‌ఎంసీ ఛైర్మన్ యర్రంశెట్టి హైమావతి పాల్గొన్నారు.

7 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ క్షేత్రం ద్వారకాతిరుమలలో వేంకటేశ్వరస్వామి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 7నుంచి 14 వరకు నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్‌వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7న ఉదయం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు.8న ధ్వజారోహణ, 10న ఎదుర్కోలు ఉత్సవం, 11న శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 12న రథోత్సవం, 13న శ్రీచక్రవారుత్సవం, ధ్వజావరోహణ, 14న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, ద్వాదశకోవెల ప్రదక్షిణ, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.





నూజివీడులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం.. ఆగిరిపల్లిలో మాట్లాడుతున్న డాక్టర్ రజిత

బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించడమే పోషణ్ పక్వాడ లక్ష్యమని ఆగిరి పల్లి హోమియోపతి వైద్యురాలు డాక్టర్ రజిత తెలిపారు. బుధవారం అంగన్ వాడీ సెంటర్లలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు. బాలింతలు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం రక్తహీనతకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు.

నూజివీడు టౌన్: ఆకు కూరలు, పాలు, గుడ్లు క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.నరేందర్ సింగ్ అన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో కె.ధనలక్ష్మీ, వైద్యులు మాధవి హెచ్‌టీవీ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త శాంతకుమారి పాల్గొన్నారు.

కైకలూరు: పోషణ్ పక్వాడ కార్యక్రమంలో 4 దశల్లో చిన్నారులకు ఇవ్వాల్సిన పోషకాహారాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో దీప్తి అన్నారు. బుధవారం కైకలూరు ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు 1 నుంచి మూడేళ్ల పిల్లల తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి: సబ్ కలెక్టర్

ముసునూరు, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం చింతలవల్లిలో మారుతీ ట్రేడర్స్ రైస్‌మిల్లు, చెక్కపల్లి, ముసునూరు సొసైటీల్లో కొనుగోలు కేం ద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను, సామగ్రిని ఆయన పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సంచులు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో భూ సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. చిల్లబోయిన పల్లికి చెందిన రైతు పట్టాదారు పాసు పుస్తకం మంజూరు కోసం పెట్టిన అర్జీపై బుధవారం సబ్ కలెక్టర్ భూమి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని, వెంటనే పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు.



చింతలవల్లిలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

విద్యుత్ శాఖకు రూ. 6 లక్షల నష్టం

ముదినేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు ముదినేపల్లి మండలంలో విద్యుత్‌శాఖకు సుమారు రూ.6 లక్షల మేరకు నష్టం వాటిల్లింది. మండలంలోని ముదినేపల్లి, చిగురుకోట, కొత్తపల్లి, సింగరాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో 30కి పైగా విద్యుత్ స్థంభాలు విరిగిపోగా, పలుచోట్ల వైర్లు తెగిపోయాయి. అన్నవరం, బొమ్మినంనాడు, వైవాక, అల్లూరు, నారాయణపురం తదితర గ్రామాల్లో విద్యుత్ స్థంభాలకు నష్టం వాటిల్లిందని ముదినేపల్లి సెక్షన్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా మండలంలో 80 శాతంగా పైగా మరమ్మతు పనులు పూర్తి చేశామని మరో రెండు రోజుల్లో పనులు పూర్తిస్థాయిలో జరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం మరమ్మతు పనులు నిర్వహించే ప్రదేశాల్లోనే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నదని ఏఈ తెలిపారు.



ముదినేపల్లి ప్రాంతంలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ముదినేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి బుధవారం ప్రారంభించారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ పాల్గొన్నారు.

వడాలిలో...

వడాలిలో బుధవారం పంచిరెడ్డి రాజారావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించారు. తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. నాయకులు నక్కా రంగారావు, మరడాని సత్యనారాయణ, తరంగ బాబు, బొంతు అప్పారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

నూజివీడు,ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్లలో అగ్నిమాపక పరికరాలను ముందు జాగ్రత్త చర్యలుగా ఏర్పాటు చేసుకోవాలని నూజివీడు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ డి.ముత్తయ్య అన్నారు. పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్లలో అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్యాస్, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమా దాలు జరిగే అవకాశం ఉంటుందని, ముందు జాగ్రత్తచర్యగా అగ్నిమాపక పరికరాలను ప్రతి అపార్ట్‌మెంట్ లోనూ ఉంచుకోవాలన్నారు.

కైకలూరు: అగ్నిప్రమాదాల పట్ల గృహిణులు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బృందావన్ కాలనీలోని అల్లూరి ఫ్రైడ్ అపార్ట్‌మెంట్ వాసులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉంటే ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చేయవచ్చని సూచించారు. గృహాల్లో గ్యాస్ ఫైర్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు.



కైకలూరులో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రతిభావంతులకు సత్కారం



అధిక మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షులు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు చిరు సత్కారం చేశారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో 991 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచిన నూజివీడు శ్రీశారద కళాశాల విద్యార్థిని కుప్పాల దేదీప్యసాయిని బుధవారం కళాశాల ఆవరణలో మల్లెపూడి నాగరాణి, సీనియర్ నాయకులు బోను అప్పారావు సత్కరించి, మెమెంటోను బహూకరించారు. కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్ కుప్పాల శంకరరావు, రాధికలకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

స్నేహరైడ్స్ 'శైలు'కు అభినందన

తల్లిదండ్రులు లేకపోయినా నూజివీడు స్నేహరైడ్స్ చిల్డ్రన్స్‌హోమ్‌లో ఆశ్రయం పొంది ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసిస్తూ ఎటువంటి ట్యూషన్ లేకుండా బైపీసీలో 772 మార్కులు సాధించిన విద్యార్థిని బిశైలు స్ఫూర్తిగా నిలిచిందని బీజేపీ శ్రేణులు కొనియాడారు. శైలుని బీజేపీ అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి, రాయపాటి విజయలీలా జ్యోతి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు షేక్ బాజీమా సత్కరించారు. కార్యక్రమంలో స్నేహ రైడ్స్ అధినేత బసవరాజు నగేష్, పార్టీ నాయకులు అంబటి మల్లేశ్వరరావు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధనాల రవికిషోర్, కార్యదర్శి సూర్యప్రకాష్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఇంటర్వ్యూ..

80 శాతం సబ్సిడీపై డ్రోన్లు

బి.శివశంకర్, ఏవో, చాట్రాయి



- **రైతులకు సబ్సిడీపై డ్రోన్లు మంజూరు చేస్తున్నారా?**

జవాబు: ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించటానికి ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై డ్రోన్లను సీహెచ్‌సీ గ్రూపులకు మంజూరు చేస్తున్నది. యూనిట్ విలువ రూ.10 లక్షలు కాగా సబ్సిడీ పోను రూ.2 లక్షలు గ్రూపు సభ్యులు చెల్లించాలి.

- **సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారు?**

జవాబు: రైతుసేవా కేంద్రాల ద్వారా వచ్చే సోమవారం నుంచి 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభిస్తాం. మండలానికి జీలుగు 500 క్వింటాళ్లు, పిల్లి పెసర 100 కింటాళ్లు, జనుము 100 క్వింటాళ్లు ప్రభుత్వం సరఫరా చేస్తున్నది.

- **ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?**

జవాబు: పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాల ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తే ఉపయోగాలు వివరిస్తున్నాం. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవటంపై అవగాహన కల్పిస్తున్నాం.

- **ఈ-క్రాప్ నమోదు ఎంత జరిగింది. విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రగతి ఎలా ఉంది?**

జవాబు: ఈ రబీ సీజన్‌లో మండలంలో మొక్కజొన్న 8700 ఎకరాలు, వరి 550 ఎకరాలు ఈ-క్రాప్ చేశాం. విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ 88 శాతం జరిగింది.

- **అన్నదాత సుఖీభవ పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారు?**

జవాబు: ఈ పథకం అమలుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే అమలుకు చర్యలు తీసుకుంటాం.

- ఆంధ్రజ్యోతి, చాట్రాయి

పోలవరం స్టేజీ వరకు బస్సు నడపాలని వినతి

చాట్రాయి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడకు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సును పోలవరం స్టేజీ వరకు నడపాలని గ్రామస్థులు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం పంపారు. చింతలపూడి-విస్సన్నపేట రహదారి గ్రామం పక్క నుంచి వెళుతున్నందున ఈ రూట్‌లో తిరిగే అన్ని బస్సులు పోలవరం గ్రామంలో స్టేజీ వద్దకు వచ్చి వెళుతుంటాయని, జంగారెడ్డిగూడెం-విజయవాడ బస్సు గ్రామంలోకి రాకపోవటంతో వృద్ధులు మహిళలు పిల్లలు ఇబ్బందుల పడుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి నిత్యం హాస్పటల్స్‌కి ఇతర పనులకు విజయవాడ వెళుతుంటారని, పరిశీలించి పోలవరం స్టేజీ వరకు బస్సు నడపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

చతుర్ధ వర్ధంతి



మరణం : 17-04-2021

కీ.శే. బొట్టు విజయచౌదరి గారు
తెలుగుదేశంపార్టీ మాజీ అధ్యక్షులు, చాట్రాయి మండలం.

నిరంతరం ప్రజాసేవకై శ్రమించి, నిత్యం ప్రజల్లో ఉంటూ... ప్రజల మన్ననలు పొందిన ప్రజానాయకులు, అందరికి ఆదర్శమూర్తిగా, కుటుంబ బాధ్యతా బాంధవ్యాలకు, మా ఉన్నతికై అహర్నిశలుపరితపించిన మహోన్నతమైన వ్యక్తి కీ.శే. బొట్టు విజయచౌదరి గారు మా నుండి దూరమై ఎన్ని సంవత్సరాలు గడిచిననూ... మీరు ఆచరించిన మార్గములు మాకు ఆదర్శం.. మీరు మాకు పంచిన ఆత్మీయ అనురాగాలు ఎప్పటికీ మా మదిలో పదిలం... మీ ఆశీస్సులు మా అందరిపై ఉండాలని ఆశిస్తూ..

మీ..

భార్య : బొట్టు వరలక్ష్మి
కుమారుడు - కోడలు : బొట్టు వంశీ - సునిష
కుమార్తెలు - అల్లుళ్ళు : చీకటి ఉష - హరినాథ్
నున్న ఉదయ - అగ్ని తేజ

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
© సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234